# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చంద్రబాబుకు భారీ భద్రత

● ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు రాక
● నేరుగా రామోజీ ఫిల్మ్‌సిటీకి వెళ్లిన బాబు
● రామోజీరావు భౌతిక కాయానికి నివాళులు



ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న చంద్రబాబు నాయుడు

శంషాబాద్ రూరల్, జూన్ 8: రామోజీరావు మరణంతో టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్‌కు కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. రామోజీరావు మరణ వార్త విన్న చంద్రబాబు ఢిల్లీ నుంచి మధ్యాహ్నం 1:30గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. కాగా చంద్రబాబుకు పోలీసు ఉన్నతాధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి కానున్న నేపథ్యంలో ఆయనకు భద్రతను పెంచారు. చంద్రబాబు ఎయిర్‌పోర్టు నుంచి తన కుటుంబ సభ్యులతో నేరుగా రామోజీ ఫిల్మ్‌సిటీకి వెళ్లి రామోజీరావు పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఎన్నికల ఫలితాల అనంతరం చంద్రబాబు మొదటిసారి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చారు.

# మృగశిర సందడి

● కిటకిటలాడిన మార్కెట్‌లు
● భారీగా చేపల రేట్లు పెంచిన వ్యాపారులు



షాద్‌నగర్‌లో భారీ చేపను చూపుతున్న బాలుడు

రంగారెడ్డి అర్బన్, జూన్ 8 : మృగశిర కార్తెను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా చేపల మార్కెట్లన్నీ కిటకిటలాడాయి. కార్తె తొలిరోజు చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. వ్యాపారులు చేపలను ఎక్కువ ధరలకు విక్రయించారు. మామూలు రోజుల్లో కొర్రమీను కిలో రూ.500, రవ్వ, బొచ్చ రూ.200, బంగారు తీగ, జెల్ల కిలో రూ.150 విక్రయిస్తున్నారు. కాగా మృగశిర కావడంతో కొర్రమీను, రవ్వ, బొచ్చ రకం చేపలపై కిలో వంద రూపాయలు పెంచి అమ్ముతున్నారు. అలాగే బంగారు తీగ, జెల్ల రకం చేపలపై రూ.50 రూపాయలు పెంచి అమ్ముతున్నారు. అయితే, ఈసారి మృగశిర కార్తె శనివారం రావడం కారణంగా ఎంతోమంది మాంసాహారానికి దూరంగా ఉన్నారని, దీంతో చేపల విక్రయానికి కొంత మేర డిమాండ్ తగ్గిందని, నేడు ఆదివారం చేపలకు డిమాండ్ ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.



ఆమనగల్లులో చేపలు కొనేందుకు వచ్చిన జనం

# గ్రూప్ 1 పరీక్షకు అంతా సిద్ధం

## నేడు 93 కేంద్రాల్లో ఎగ్జామ్

● హాజరుకానున్న 55,692మంది అభ్యర్థులు
● ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ



మొయినాబాద్‌లోని పరీక్ష కేంద్రం

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూన్ 8 : గ్రూప్-1 పోస్టుల భర్తీకి ప్రిలిమినరీ పరీక్ష నేడు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరగనుంది. ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించే ఈ పరీక్ష కోసం అధికారులు పకడ్బందీ ఏర్పాటు పూర్తి చేశారు. జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు 93 కేంద్రాలను ఏర్పాటు చేయగా 55,692 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. రూట్ ఆఫీసర్లు, రీజనల్ కోఆర్డినేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్, ఐడెంటిఫికేషన్ అధికారులు, లైజన్ అధికారులు పరీక్ష నిర్వహణలో పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. పరీక్ష సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా, మంచినీటి సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. ఫస్ట్ ఎయిడ్ చికిత్స అందించేలా ఏఎన్ఎంలను కేంద్రాల వద్ద నియమించారు. సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పరీక్ష సెంటర్ వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు ఎగ్జామ్ సెంటర్ల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూయనున్నారు. బయోమెట్రిక్ విధానం అమలులో ఉన్నందున అభ్యర్థులు కనీసం రెండు గంటల ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో ఓఎంఆర్ పద్ధతిలో ప్రిలిమినరీ పరీక్ష జరగనుంది. అభ్యర్థులను ఉదయం 9 గంటల నుండి పరీక్షా కేంద్రాలలోనికి వెళ్లేందుకు అనుమతిస్తారు. ఉదయం పది గంటలకు మెయిన్ గేట్లు మూసివేయనున్నారు. బయోమెట్రిక్ హాజరు స్వీకరణ కోసం ఈసారి ప్రత్యేకంగా ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశారు. 160 మంది అభ్యర్థులకు ఒకటి చొప్పున బయోమెట్రిక్ యంత్రాన్ని సమకూర్చారు. అదనపు యంత్రాలను కూడా అందుబాటులో ఉంచారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపించనున్నారు. మహిళా పోలీసులు, ఇతర మహిళా సిబ్బందిని కేంద్రాల వద్ద ఏర్పాటు చేశారు. సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకారణాలకు అనుమతి లేదు. కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య స్ట్రాంగ్‌రూం నుండి ప్రశ్నపత్రాలు, ఇతర సామగ్రిని పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్ష ముగిసిన అనంతరం కూడా పూర్తి భద్రతా నడుమ ఓఎంఆర్ షీట్లను స్ట్రాంగ్‌రూంకు చేర్చనున్నారు. రీజినల్ కో ఆర్డినేటర్, చీఫ్ సూపెరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, సంబంధిత శాఖల అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసేలా చర్యలు జిల్లా కలెక్టర్ శశాంక చర్యలు తీసుకున్నారు.

### అభ్యర్థులకు సూచనలు...

● ఉదయం 9 గంటల్లోగా అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.
● 10 గంటల వరకే అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు.
● ఏ-4 సైజ్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్ తప్పనిసరిగా తీసుకు వెళ్లాలి. కలర్ ప్రింట్ తీసుకుని ఉంటే మంచిది.
● హాల్‌టికెట్‌పైన లేటెస్ట్ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో అతికించాలి.
● హాల్ టికెట్‌లో ఫోటో సరిగా కనిపించకపోతే... అభ్యర్థిని ధ్రువీకరిస్తూ గెజిటెడ్ అధికారి లేదా చివరగా చదివిన కళాశాల ప్రిన్సిపాల్‌తో సంతకం తీసుకోవాలి. అభ్యర్థి మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలపై సంతకం చేయించుకుని తీసుకెళ్లాలి.
● పాస్‌పోర్ట్, పాన్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తప్పని సరిగా తీసుకువెళ్లాలి.
● పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు బయోమెట్రిక్ వేలి ముద్రలతో హాజరు నమోదు చేస్తారు. అభ్యర్థులు మెహిందీ టాటూలు పెట్టుకోకుండా శుభ్రంగా ఉంచుకోవాలి. ఒకవేళ ఉంటే వాటిని తొలగించుకోవాలి.
● అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించాలి.
● హ్యాండ్ వాచ్‌లు, స్మార్ట్‌వాచ్‌లు, సెల్‌ఫోన్లు, కాలిక్యులేటర్లు, బ్లూటూత్ డివైజ్, సెల్‌ఫోన్లు, రైటింగ్ ప్యాడ్, వైట్‌నర్, ఎరేజర్‌లు తీసుకెళ్లవద్దు.

# వామ్మో..జూన్

## పిండేస్తున్నారు..

● తల్లిదండ్రుల్లో మొదలైన ఆందోళన
● చదువుకోసం అప్పుల వేట
● కార్పొరేట్ బడుల్లో భారీగా ఫీజుల పెంపు
● భారంగా మారిన స్కూల్ ఫీజుల భారం
● బెంబేలెత్తిపోతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

> మరో మూడు రోజుల్లో బడిగంట మోగనుంది. ఇన్ని రోజులు ఆటాపాటల్లో మునిగిన విద్యార్థులు ఇక బడి బాట పట్టనున్నారు. ఈనెల 12న బడులు తెరుచుకోనుండటంతో తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలైంది. జూన్ అంటేనే భయపడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులను అడ్డగోలుగా పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులపై తీవ్ర భారం మోపుతున్నాయి. డబ్బే ధ్యేయంగా విద్యా విలువలను తుంగలోకి తొక్కుతూ తల్లిదండ్రులను పీల్చిపిప్పి చేస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూన్8) : వేసవి సెలవులు ముగియనున్నాయి. ఆటాపాటల్లో మునిగిన విద్యార్థులు ఇక బడిబాట పట్టనున్నారు. ఈనెల 12వ తేదీన పాఠశాలలు తెరుచుకోనుండటంతో తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలైంది. జూన్ నెల పేరు వింటేనే హడలి పోతున్నారు. ఇప్పుడిప్పుడే తొలకరి వర్షాలు కురియడం... ఇదే సమయంలో ఎరువులు, విత్తనాల కొనుగోలుకు పెట్టుబడి.. ఇదే సమయంలో పిల్లలను బడుల్లో చేర్పించడం, పిల్లల ఫీజులు, పుస్తకాలు, డ్రెస్సులు, ఇతర సామగ్రి కొనుగోలు వంటి విషయాల్లో ఆందోళనతో ఉన్నారు. ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉన్న తల్లిదండ్రులు చదువుల ఖర్చుల లెక్కలేసుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలు, కార్పొరేట్ స్కూళ్లలో అడ్డూ అదుపు లేకుండా పెరిగిన ఫీజులను చూసి జడుసుకుంటున్నారు.

### పెంచేస్తున్న ఫీజులు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రతీ ఏడాది ప్రైవేట్ పాఠశాలల్లో ఏదో కొత్తదనమంటూ ఫీజులను పెంచేస్తున్నారు. పాఠశాలల మధ్య ఎంత పోటీ ఏర్పడుతున్నా ఫీజుల విషయంలో మాత్రం అందరూ కఠినంగానే వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించకపోవడం, ఉపాధ్యాయుల కొరత తీర్చకపోవడం వంటి కారణాలతో పాటు కొందరు ఉపాధ్యాయులు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారు. మరికొంతమంది ఉపాధ్యాయులు రియల్ ఎస్టేట్ వంటి ఇతర వ్యాపారులు చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలంటే విద్యార్థుల తల్లిదండ్రుల్లో దురాభిప్రాయం ఏర్పడింది. పేదవారైనా సరే తమ పిల్లలను మంచి చదువులు చదివించాలనే ఉద్దేశంలో ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అడ్డగోలుగా ఫీజులు పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులపై తీవ్ర భారం మోపుతున్నారు. వారి జేబులను ఖాళీ చేస్తున్నాయి. టెక్నో, గ్రామర్, మోడల్, కాన్సెప్ట్ వంటి తోకపేర్లు తగిలించుకుని ప్రచారంలో దూసుకుపోతున్నాయి. ఏటా 20-30 శాతం ఫీజులు పెంచుతున్నా ప్రభుత్వం కానీ.. అధికారులు కానీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### నియంత్రణ కరువు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు రెండు వేలకు పైగా ఉన్నాయి. వీటిలో విద్యా వ్యాపారం అడ్డూఅదుపు లేకుండా పోతోంది. స్టేట్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ తదితర బోర్డుల పేరిట ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల నియంత్రణ మచ్చుకైనా కనిపించడం లేదు. నాణ్యమైన విద్యాబోధన, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని నమ్మబలుకుతూ ఎక్కువగా ఫీజులను వసూలు చేస్తున్నాయి.

### నిబంధనలు పాటించాలి

విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. ఇప్పటికే అన్ని విద్యా సంస్థల యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. ఎక్కడైనా ఫీజుల కోసం బలవంతం చేస్తే ఫిర్యాదు చేయాలి. ప్రభుత్వం నిర్ధేశించిన ధరల ప్రకారమే ఫీజు తీసుకోవాలి. లేదంటే చర్యలు తప్పవు.

సుశీందర్‌రావు, జిల్లా విద్యాధికారి

### ఫీజులు పెంచేసిన కార్పొరేట్ స్కూళ్లు


ఉమ్మడి జిల్లాలోని శ్రీచైతన్య, నారాయణ వంటి స్కూళ్ల యాజమాన్యాలు తమ విద్యా సంస్థల్లో 30-40 శాతం మేర ఫీజులను పెంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. త్వరలో విద్యా సంవత్సరం ప్రారంభం కానుండటంతో విద్యార్థులకు, తల్లిదండ్రులకు ముందస్తు ఫీజులు చెల్లించాలని, రాయితీలు ఇస్తామని ప్రకటించడంతో పాటు పుస్తకాలు, యూనిఫామ్స్, స్టేషనరీ కొనుగోలు చేయాలని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

### బ్యాగులు, షూస్.. అన్నీ భారమే

మార్కెట్‌లో పిల్లలకు సంబంధించిన పుస్తకాలు బ్యాగులు, వాటర్ బాటిళ్లు, షూస్, ఇలా అన్ని రకాల వస్తువుల ధరలు పెరడగం పేరెంట్స్‌కు భారంగా మారింది. తోటి పిల్లలు రకరకాల వస్తువులు తెచ్చుకుంటే తమ పిల్లలలకు ఏది తక్కువ కాకూడదన్న భావనతో ఉన్న తల్లిదండ్రులు పిల్లలకు కావాల్సిన అన్ని వస్తువులు ఖరీదు ఎంతైనా సరే కొనుగోలు చేసి ఇస్తున్నారు. మార్కెట్‌లో అన్ని వస్తువుల ధరలు పెరగడంతో తల్లిదండ్రులు భారంగా భావిస్తున్నారు. జూన్ అంటేనే భయపడుతున్నారు. పాఠశాలల యాజమాన్యాలు పుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు బ్యాగులను కూడా తమ వద్దనే కొనాలనే నిబంధనలు విధిస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తప్పని పరిస్థితుల్లో అక్కడే కొనాల్సి వస్తుంది.

| ఫీజుల వివరాలు తరగతి | ప్రైవేట్ స్కూల్ (రూ.వేలల్లో) | కార్పొరేట్‌స్కూల్ (రూ.వేలల్లో) | సీబీఎస్ఈ (రూ. వేల నుంచి లక్షల్లో) |
|---|---|---|---|
| నర్సరీ | 15-20 | 30-40 | 60- 2.20 |
| ప్రీ ప్రైమరీ-1(ఎల్‌కేజీ) | 18-25 | 35-55 | 70- 2.0 |
| ప్రీ ప్రైమరీ-2(యూకేజీ) | 20-32 | 38-58 | 75-2.0 |
| క్లాస్ 2 నుంచి క్లాస్ 4 | 25-35 | 40-60 | 80-2.50 |
| క్లాస్ 5 నుంచి క్లాస్ 6 | 30-45 | 45-65 | 85 -2.50 |
| క్లాస్ 7 నుంచి క్లాస్ 9 | 35-50 | 75-90 | 90-2.80 |
| 10వ తరగతి | 40-60 | 95-1.20 | 95 -3.40 |

| ఒక్కో విద్యార్థిపై ఖర్చు (రూపాయల్లో) | |
|---|---|
| పుస్తకాలు | 5,000-7,000 |
| రెండు జతల యూనిఫాం | 2,000-2,500 |
| రెండు జతల షూస్ | 700-1,000 |
| ట్రాన్స్‌పోర్టు చార్జి | 2,000-9,000 |
| స్కూల్ బ్యాగ్ | 500-700 |
| టిఫిన్ బాక్స్, బాటిల్స్ | 250-500 |
| స్టేషనరీ ఖర్చులు | 200-500 |




# షెడ్డు నిర్మాణంలో లోపం తడిసి ముద్దవుతున్న ధాన్యం

## పట్టించుకోని యంత్రాంగం.. - నష్టపోతున్నరైతాంగం



షెడ్డులో వర్షపు నీటితో తడిసిన ధాన్యం

షాద్‌నగర్‌అర్బన్, జూన్ 8: షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్మించిన ఓపెన్ షెడ్లలో వేస్తున్న ధాన్యం వర్షపు నీటికి తడిసి ముద్దవుతోంది. మార్కెట్ యార్డులోని రెండు షెడ్లలో రైతులు తీసుకు వస్తున్న ధాన్యం బస్తాలను వేసి కమీషన్ ఏజెంట్లు ఖరీదుదారులకు విక్రయిస్తున్నారు. దాదాపు 18 అడుగుల ఎత్తులో ఉన్న షెడ్ల పైకప్పు నుంచి వచ్చే వర్షపు నీరు షెడ్డులోకి రాకుండా సైడుకు అదనపు రేకులు వేయలేదు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా వర్షపు నీరు షెడ్లలోకి వచ్చి ధాన్యం తడిసిపోతోంది. ఈదురుగాలులతో కూడిన వర్షం వస్తే ప్రతీ బస్తా తడిసి పోతోంది. వర్షాలకు ప్రతీ వర్షానికి రైతులు, కమీషన్ ఏజెంట్లు, ఖరీదుదారులు ఇబ్బంది పడుతున్నారు. గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి షెడ్డులోని ధాన్యం బస్తాలు చాలా వరకు తడిశాయి. ముందు జాగ్రత్తగా కొందరు ఫ్లోరింగ్‌పై కవర్లు వేసి వాటిపై ధాన్యం బస్తాలను వేసుకున్నారు. కొందరు షెడ్డు కిందే బస్తాలు వేస్తున్నాం కదా అని బస్తాల కింద కవర్లు వేయలేదు. దీంతో ఆ బస్తాలన్నీ తడిశాయి. వర్షపు నీరు షెడ్డులోకి రాకుండా సైడ్‌కు అదనంగా రేకులు వేయించాలని మార్కెట్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని రైతులు, వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపునీటితో ధాన్యం తడిసినప్పుడు రైతులు, ఖరీదుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇంత జరుగుతున్నా మార్కెటింగ్ శాఖ మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైన వ్యవసాయ మార్కెట్ శాఖ స్పందించి, వర్షపు నీరు షెడ్డులోకి రాకుండా కట్టడి చేయాలని రైతులు, కమీషన్ ఏజెంట్లు కోరుతున్నారు.

### ప్రతి యేటా నష్టపోతున్నాం



వర్షపు నీటితో ప్రతియేటా నష్టపోతున్నాం. షెడ్డు పైకప్పు నీరు లోపలికి రాకుండా చర్యలు తీసుకోవాలని చెబుతున్నా మార్కెటింగ్ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. షెడ్డు నిర్మించిన పుటి నుంచి ప్రతీ వర్షానికి ధాన్యం తడవడం తాము నష్టపోవడం జరుగుతున్నది.

- కృష్ణయ్యగౌడ్, ఖరీదుదారుడు, షాద్‌నగర్

### ఇద్దరి మధ్య నలిగిపోతున్నాం



వర్షపు నీటితో షెడ్డులోని ధాన్యం తడిసిపోతున్నప్పుడల్లా తాము రైతులకు, ఖరీదుదారులకు నచ్చచెప్పడానికి నలిగి పోవాల్సి వస్తున్నది. వర్షపు నీటితో రైతులతో పాటు ఖరీదుదారులు నష్టపోతున్నారు. షెడ్డు రేకులను పెంచి వర్షపు నీరు లోపలికి రాకుండా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ చైర్మన్లకు, కార్యదర్శులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదు.

- పి. చెన్నారెడ్డి, కమీషన్ ఏజెంటు, షాద్‌నగర్

### వర్షపు నీటిని కట్టడి చేస్తాం

వర్షపునీరు షెడ్డులోకి రాకుండా కట్టడి చేస్తాం. ఇక్కడి సమస్యల పరిష్కారానికి సంబంధించి ఉన్నతాధికారులకు నూతనంగా మరోసారి ప్రతిపాదనలు పంపిస్తాం. మంజూరు కాగానే సైడింగ్‌కు అదనం రేకులను ఏర్పాటు చేయిస్తాం. వర్షాకాలం వరి పంట వచ్చే వరకు సైడింగ్‌ను నిర్మించి మార్కెట్‌లో ధాన్యం తడవకుండా చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాస్, మార్కెట్ శాఖ కార్యదర్శి, షాద్‌నగర్

# దోపిడీ దొంగలతో తల్లీకూతుళ్ల పోరాటం

● కళ్లలో కారం నీళ్లు చల్లి బంగారం అపహరణకు యత్నం
● వాకింగ్‌కు వెళ్లిన కుటుంబ సభ్యులపై చైన్‌స్నాచర్ల అఘాయిత్యం
● తీవ్రంగా ప్రతిఘటించడంతో బైక్, బ్యాగు వదిలి పరారీ
● ఎట్టకేలకు పట్టుబడిన దొంగలు.. ఒకేరోజు మూడు చోరీలు
● ఇంతకుముందు పలు కేసుల్లో జైలుకెళ్లిన నిందితులు
● అదుపులోకి తీసుకున్న పోలీసులు

వివరాలు 7లో..




వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సునీతారెడ్డి

# కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్

● చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య

చేవెళ్ల, జూన్ 8 : రాజీమార్గమే రాజమార్గమని, కేసుల సత్వర పరిష్కరం కోసమే జాతీయ లోక్అదాలత్ నిర్వహిస్తున్నట్లు చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య, జూనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్‌లు అన్నారు. శనివారం చేవెళ్ల కోర్టు ఆవరణలో జాతీయ లోక్అదాలత్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోక్అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా, మొత్తం 1,833 కేసులు పరిష్కరించి, రూ.10,33,080 జరిమానా విధించినట్లు తెలిపారు. రిటైర్డ్ జడ్జి సాంబశివరావు, సీఐలు లక్ష్మారెడ్డి, అబిబుల్లాఖాన్, వీరబాబు, కాంతారెడ్డి, ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఎస్సై విఠల్‌రెడ్డి, ఏపీపీ సుశీలా మాయూరి, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యానందం, ఉపాధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి, అధికారులు, న్యాయవాదులు, పాల్గొన్నారు.





మాట్లాడుతున్న దశరథ రామయ్య

# టీడీపీ చూపు.. తెలంగాణ వైపు

- రాష్ట్రంలో సైకిల్ సవారీకి వ్యూహాత్మకంగా అడుగులు
- అసంతృప్తి నేతలకు 'వల'.. 'స్థానిక' సమరంలో పోటీకి సన్నద్ధం
- పార్టీ అధినేత సూచనతో నాయకుల ప్రణాళికలు!
- ఏపీలో ఘనవిజయంతో ఉత్సాహంగా తెలుగు తమ్ముళ్లు..


తాండూరు, జూన్ 8 : ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో ఎవరూ ఊహించని విధంగా భారీ మెజార్టీతో అధిక సీట్లు సాధించి అధికారంలోకి వచ్చింది. ఎన్డీఏతో జతకలిసి కేంద్రంలోనూ చక్రం తిప్పేందుకు ఎంపీ సీట్లనూ గెలుచుకుంది. దాంతో మళ్లీ తెలంగాణలో సైకిల్ సవారీకి సిద్ధమైనట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. తెలంగాణ వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీకి మంచి ఆదరణ ఉంది. ఇప్పటికీ క్షేత్రస్థాయిలో నాయకత్వం ఉన్న జిల్లాగా వికారాబాద్ జిల్లాకు పేరుంది. జిల్లాలోని పలువురు నేతలతో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీకి కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఇప్పటికీ సత్సంబంధాలు ఉన్నాయి. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక.. చంద్రబాబు హైదరాబాద్‌లో నిర్వహించే విజయోత్సవ సభ తర్వాత.. పార్టీ పటిష్టతపై దృష్టి సారించనున్నట్లు సమాచారం. రాష్ట్రం విడిపోయి పదేళ్లు దాటినా.. ఇప్పటికీ టీడీపీకి పట్టున్న వికారాబాద్ జిల్లాలోని తాండూరు, పరిగి నియోజకవర్గాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా ప్రాంతాల నేతలు చంద్రబాబును కోరనున్నట్లు సమాచారం. ఏపీ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి పోరాడినట్లే తెలంగాణలో కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిగా ముందుకు వెళ్లి బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు దీటుగా పోటీలో నిలవాలని భావిస్తున్నట్లు సమాచారం. కాగా, ఇదే జరిగితే తెలంగాణలో తెలుగుదేశం పార్టీ మళ్లీ పుంజుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈమేరకు ఈ నెలాఖరులోగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, అరవింద్ కుమార్‌గౌడ్ వికారాబాద్ ప్రాంతానికి చెందిన ఇతర నాయకులు, ఇతర పార్టీల్లో అసంతృప్తి నేతలు, నాయకులు, కార్యకర్తల జాబితాను సిద్ధం చేసేందుకు ప్రణాళికలు తయారు చేయనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే, 2014 కంటే ముందు ప్రజాప్రతినిధులుగా టీడీపీ నుంచి కొనసాగివారితో పాటు ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్నవారి జాబితాను కూడా సిద్ధం చేయనున్నట్లు సమాచారం. ఏదిఏమైనా టీడీపీ ఇక్కడ బరిలో నిలిస్తే బీఆర్ఎస్ స్థానాన్ని పూరించేలా కూటమి ఏర్పడే అవకాశాలూ స్పష్టంగా కనిపిస్తున్నాయి.













# దోపిడీ దొంగలతో తల్లీకూతుళ్ల పోరాటం

- కళ్లలో కారం నీళ్లు చల్లి బంగారం అపహరణకు యత్నం
- మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లిన కుటుంబ సభ్యులపై చైన్‌స్నాచర్ల అఘాయిత్యం
- తీవ్రంగా ప్రతిఘటించడంతో.. బైక్, బ్యాగు వదిలి దౌడుతీసిన దుండగులు
- ఎట్టకేలకు పట్టుబడిన దొంగలు.. ఒకేరోజు మూడు దొంగతనాలు
- ఇంతకుముందు పలు కేసుల్లో జైలుకెళ్లిన వైనం
- గాలింపు చేపట్టి అదుపులోకి తీసుకున్న పోలీసులు


స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి నగలు


పహాడిషరీఫ్/హైదరాబాద్ సిటీ, జూన్ 8: ఒంటరిగా వాకింగ్‌కు వెళ్లినవారు, శివారు ప్రాంతాల్లో రోడ్డుపై వెళ్తున్న వారిని టార్గెట్ చేసి కారం కలిపిన నీటిని ముఖంపై విసిరి.. ఆ గ్యాప్‌లో చైన్ స్నాచింగ్‌లు, దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు ఘరానా స్నాచర్స్ ఆట కట్టించారు రాచకొండ పోలీసులు. వారి వద్ద నుంచి 8తులాల బంగారం, 30 తులాల వెండి, బైక్ స్వాధీనం చేసుకున్నారు. మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, డీఐ సుధీర్‌కృష్ణతో కలిసి డీసీపీ సునీతారెడ్డి శనివారం పహాడిషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. మహేశ్వరం మండలం పరిధిలోని మంఖాల్ గ్రామానికి చెందిన గడ్డమీది కల్పన మే 24న ఉదయం 5 గంటలకు తన కూతుళ్లు లక్ష్మీప్రసన్న, నేహా, కుమారుడు మనీష్‌కుమార్‌తో కలిసి మంఖాల్ నుంచి శంషాబాద్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డులో వాకింగ్‌కు వెళ్లింది. సుమారు 5.50 గంటల ప్రాంతంలో ముఖానికి మాస్కులు, హెల్మెట్‌లు ధరించి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు వారి దగ్గరకు వచ్చారు. అప్పటికే వాటర్ బాటిల్‌లో కారం కలిపిన దుండగులు.. ఒక్కసారిగా కల్పన కళ్లలో కొట్టారు. దాంతో ఆమె కూతుళ్లు, కుమారుడు భయాందోళనకు గురయ్యారు. వెంటనే దుండగులు కల్పన మెడలోని బంగారు గొలుసు లాక్కోవడానికి యత్నించారు. వెంటనే కల్పన, కూతురు లక్ష్మీప్రసన్నలు ఆత్మవిశ్వాసంతో, ధైర్యంగా దొంగలకు ఎదురుతిరిగారు. పారిపోవడానికి ప్రయత్నించిన దొంగలతో పోరాడారు. రెచ్చిపోయిన దొంగలు కర్రతో తల్లీ కూతుళ్లను కొట్టారు. దాంతో వారి నదుటిపై గాయాలయ్యాయి. అయినా, పట్టువిడవకుండా గట్టిగా కేకలు వేస్తూ తిరగబడి బైక్ తాళాలు లాక్కున్నారు. ఇక లాభం లేదనుకున్న దొంగలు బైక్‌ను, వారివెంట తెచ్చుకున్న బ్యాగును అక్కడే వదిలేసి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కల్పన, ప్రసన్నలను ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు పహాడిషరీఫ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా, మహేశ్వరం డివిజన్‌లో ఒకేరోజు మూడు చైన్‌స్నాచింగ్ కేసులు నమోదవడంతో రాచకొండ సీపీ ఆదేశాల మేరకు డీసీపీ సునీతారెడ్డి మూడు ప్రత్యేక టీమ్‌లను రంగంలోకి దింపారు. మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక పోలీసులు కల్పన కేసులో బైక్, బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు టెక్నికల్ ఆధారాలు దొరికాయి. పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, సిబ్బంది సధీర్, వెంకటేశ్వర్లు, రైల్వే పోలీసుల సహకారంతో ఇద్దరు ఘరానా దొంగలైన మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన టక్ షమ్‌షీర్‌సింగ్, నిజామాబాద్‌కు చెందిన దండ్ల బాబు అలియాస్ బాబు బాలాజీ గైక్వాడ్‌లను అదుపులోకి తీసుకొన్నారు.

**పటాన్ చెరులో బైక్ చోరీ చేసి..**

కాగా, పట్టుబడిన నిందితులను విచారించగా పఠాన్ చెరులో ద్విచక్ర వాహనం దొంగతనం చేసి ఒకేరోజు పహాడీషరీఫ్‌లో కల్పన మంగళ సూత్రం, మహేశ్వరంలో గొర్ల కాపరి కంట్లో కారం నీళ్ల చల్లి వెండి, బంగారం వస్తువులు, కందుకూరులోని రాచటూర్‌లో మహిళ కంట్లో కారం నీళ్ల చల్లి మంగళసూత్రం లాక్కొని పారిపోయినట్లు తేలింది. గతంలో వీరు పలు దోపిడీ కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చారు. 2021 నుంచి పరారీలో ఉన్నారు. ఇప్పటివరకు వీరిపై 82 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన మహేశ్వరం ఏసీపీ, ఇన్‌స్పెక్టర్, క్రైం టీమ్‌లను డీసీపీ అభినందించారు. దోపిడీ దొంగలతో ధైర్యంగా పోరాడిన కల్పన, ప్రసన్నలను డీసీపీ అభినందించారు.

# ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం

- హైకోర్టు పర్మినెంట్ స్టే ఉన్నా పట్టించుకోని వైనం
- విజయ విద్యాలయ క్రీడాస్థలంపై కొందరి కన్ను
- రూ.10 కోట్ల విలువైన స్థలానికి ఎసరు
- గతంలోనే ప్రభుత్వ భూమిగా తేల్చిచెప్పిన కోర్టు


కోర్టు ఆదేశం మేరకు కలెక్టర్‌కు తహసీల్దార్ నివేదించిన లెటర్



హైస్కూల్ ప్లేగ్రౌండ్ తమదంటూ పాతిన బోర్డు

తాండూరు, జూన్ 8: పట్టణం నడిబొడ్డులో ఉన్న రూ. 10కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమవుతోంది. సర్వేనంబర్ 111లో గల విజయ విద్యాలయ హైస్కూల్‌కు ఆనుకొని సుమారు 2వేల గజాల భూమి ఉంది. గతంలో పాఠశాలకు ఆటస్థలం కొరకు ప్రభుత్వ ఆ భూమిని వాడుకునేందుకు ఇచ్చింది. అయితే, ఆ భూమి తమదని, హక్కుదారులమని 2015 సంవత్సరంలో విజయ విద్యాలయ హైస్కూల్ యాజమాన్యంలోని కొందరు వ్యక్తులు తెలిపారు. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని ప్లాట్లుగా చేసి విక్రయించే యత్నం చేశారు. పూర్వవిద్యార్థులు, స్థానికులు ముందుకొచ్చి కోర్టును ఆశ్రయించడంతో అప్పట్లోనే హైకోర్టు పర్మినెంట్ స్టే ఇచ్చింది. రెవెన్యూ అధికారులు అది ప్రభుత్వ స్థలమని తేల్చేశారు. కోర్టుకు కూడా నివేదిక సమర్పించారు. అయితే, పదేళ్ల తర్వాత మళ్లీ ఈ అంశం తెరపైకి వచ్చింది. సర్వే నంబర్ లేకుండా డ్యాకుమెంట్లు సృష్టించి విజయ విద్యాలయ హైస్కూల్ పక్కన ప్లేగ్రౌండ్‌గా పేర్కొన్న ప్రభుత్వ స్థలం తమదేనంటూ గ్రౌండ్‌ను క్లీనింగ్ చేసి స్థలం చుట్టూ సిమెంట్ స్తంభాలు పాతి బోర్డును పాతారు. ఇప్పటికే ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున స్థానికులు, పూర్వవిద్యార్థులు కోర్టు ధిక్కారం కింద హైకోర్టును తిరిగి ఆశ్రయించాలని నిర్ణయించారు. అయితే, విజయ విద్యాలయ హైస్కూల్ యాజమాన్యంలోని కొందరు వ్యక్తులు ఈ స్థలం తమదేనంటూ.. గతంలో కోర్టును ఆశ్రయించగా డిస్మిస్ చేసింది. అది ప్రభుత్వ స్థలమని, 2015లో రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. అయితే ఈ స్థలం విషయం కొలిక్కి తెచ్చేందుకు రెవెన్యూ అధికారులు అందుబాటులో లేరు. లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో బిజీగా ఉన్నామని, తర్వాత పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.

**ప్లేగ్రౌండ్ స్థలాన్ని రక్షించుకుంటాం**



విజయ విద్యాలయ హైస్కూల్ ప్లేగ్రౌండ్ స్థలం కబ్జాను అడ్డుకుంటాం. గతంలో ఈ స్థలం అన్యాక్రాంతం కాకుండా అడ్డుకున్నాం. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ స్థలమే. కొందరు కావాలనే తమదని చెప్పుకుంటున్నారు.

- పరిమళ, మాజీ కౌన్సిలర్

**గతంలో హైకోర్టు స్టే ఇచ్చింది**



పూర్వవిద్యార్థులు, స్థానికులం కలిసి స్థలం కబ్జా కాకుండా గతంలో హైకోర్టును ఆశ్రయించాం. పిటిషన్ దారుడిగా నేనే కోర్టులో కేసు ఫైల్ చేశా. ఇప్పటికీ స్టే ఉంది. కోర్టు ధిక్కారం కింద తిరిగి హైకోర్టుకు వెళ్తాం.

- లొంక పాండు, విద్యా కమిటీ మాజీ చైర్మన్ (విజయ విద్యాలయ)

# కుంగుతున్న కల్వర్టు.. పొంచి ఉన్న ప్రమాదం



కొద్ది రోజులుగా మేడ్చల్ మండలంలో కురుస్తున్న అడపాదడపా వర్షాలకు డబిల్‌పూర్-నూతన్‌కల్ ఆర్అండ్‌బీ రోడ్డుపై ఉన్న కల్వర్టు కుంగిపోయింది. ఫలితంగా వాహనదారులు భయపడుతూ కల్వర్టు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. కల్వర్టు కుంగి కల్వర్టు పక్క పెద్ద గుంతలు ఏర్పడటంతో స్థానికులు రోడ్డుకు ఒకవైపు హెచ్చరికగా రెడ్ బారికేట్‌ను ఏర్పాటుచేశారు. సంబంధిత అధికారులు మాత్రం కల్వర్టు మరమ్మతు గురించి పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలుగు రోజులుగా కల్వర్టు రోజుకింత కుంగుతుండటంతో పెద్ద వాహన దారులు రోడ్డుపై ప్రయాణించటానికి జంకుతున్నారు. డబిల్‌పూర్-నూతన్‌కల్ గ్రామాలకు మధ్య ఉన్న ఇస్కాన్ ఆలయం వద్ద వర్షపు నీరు సమీపంలోని చెరువు కుంటలో చేరటానికి ఈ కల్వర్టును ఏర్పాటు చేశారు. అయితే, కాంట్రాక్టర్ నాణ్యత లేకుండా నిర్మించడంతో కల్వర్టు కుంగిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా, నిత్యం వందల వాహనాలు నడిచే రోడ్డుపై నిర్మించిన కల్వర్టుకు వెంటనే మరమ్మతులు చేయాలని నూతన్‌కల్, డబిల్‌పూర్ గ్రామస్తులు కోరుతున్నారు.

- మేడ్చల్ టౌన్, జూన్ 8

# మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి

ఆదిభట్ల, జూన్ 8 : మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు కావాల్సిన మౌళిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని వేదపురి, బాలాజీనగర్ కాలనీల్లో కౌన్సిలర్లు కుంట్ల మౌనిక ఉదయపాల్‌రెడ్డి, మర్రి అర్చన రాంరెడ్డిలతో కలిసి శనివారం రూ22 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. నిరంజన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతీ వార్డులో సమస్యలు గుర్తించడం జరిగిందని, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లాంటి మౌళిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, మిగతా సమస్యలు దశలవారిగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. వైస్ చైర్మన్ యాదగిరి, ఏఈ వీరాంజనేయులు, వర్క్ఇన్‌స్పెక్టర్ జాన్సన్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, రామారావు, పాండు గౌడ్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భారీగా చేపల కొనుగోళ్లు

● మృగశిర కార్తె రోజున కొర్రమీను రూ.600, రవ్వ రూ.250-300కు అమ్మకాలు



ఇబ్రహీంపట్నంలో జోరుగా చేపల విక్రయాలు

ఇబ్రహీంపట్నం, జూన్ 8: మృగశిర కార్తె కావడంతో శనివారం చేపల కొనుగోళ్లు, అమ్మకాలు భారీగా పెరిగాయి. ఇబ్రహీంపట్నం మార్కెట్లో చేపల ధర ఒక్కసారిగా పెరిగింది. కొర్రమీను సాధారణ రోజుల్లో కిలో రూ.500 ఉండగా మృగశిర రోజు కిలోకు వంద పెంచి రూ.600లకు అమ్మారు. అలాగే రవ్వ, బొచ్చ సాధారణంగా రూ.200 కిలో ఉంటే రూ.250-300కు అమ్మారు. బంగారు తీగ, జెల్ల రూ.200కు అమ్మారు. ఇబ్రహీంపట్నం చెరువులో శనివారం తెల్లవారు జాము నుంచే ప్రజలు చేపల కోసం బారులు తీరారు.

**షాద్‌నగర్ అర్బన్:** మృగశిర కార్తె సందర్భంగా పట్టణంలో చేపల రేట్లు పెంచారు. రోజూ విక్రయించే ధర కంటే కిలోకు 50 వరకు ఎక్కువ తీసుకున్నారు. షాద్‌నగర్ లో చేపల లభ్యత లేక హైదరాబాద్ రాంనగర్ మార్కెట్ నుంచి తెచ్చి విక్రయిస్తున్నారు. అయితే మృగశిర శనివారం రావడంతో గిరాకీ పెద్దగా రాలేదని వ్యాపారులు తెలిపారు.

**కందుకూరు:** కందుకూరు, కొత్తగూడ, ముచ్చర్ల, తిమ్మాపురం గ్రామాల్లోని చెరువుల వద్ద చేపలను భారీగా కొన్నారు. చెరువుల వద్దకు ప్రజలు బారులు తీరగా వారికి టోకెన్లు ఇచ్చి లైన్‌లో వచ్చిన వారికి చేపలు అమ్మారు.



కందుకూరు: చేపల కోసం చెరువు వద్దకు వచ్చిన గ్రామస్తులు





శంషాబాద్‌లో చేపలుకొంటున్న వినియోగదారులు



మొయినాబాద్ రూరల్: అజీజ్‌నగర్ గ్రామంలో చేపల విక్రయంలో భారీగా వచ్చిన ప్రజలు



యాచారం మండలం మాల్‌లో చేపల కొంటున్న జనం

**యాచారం:** మాల్, మేడిపల్లి గ్రామాల మత్స్యకారులు నాగార్జునసాగర్ నుంచి చేపలు తెచ్చి గ్రామాల్లో విక్రయించారు. చింతపట్ల, నానక్‌నగర్ చెరువుల వద్ద చేపల విక్రయాలు సాగాయి. కిలో కొర్రమట్ట రూ.850కి అమ్మారు. చెరువుల వద్దకు జనం వెళ్లినా మధ్యాహ్నం 2గంటల కల్లా చేపలు అయిపోవడంతో నిరాశగా వెనుదిరిగారు.

**చేవెళ్ల:** మండలంలో చేపల కోసం జనం ఎగబడ్డారు. చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ మండలాల్లో భారీగా చేపల అమ్మకాలు జరిగాయి. కిలోకు వంద పెంచారు. బొచ్చె రూ.300, రవ్వ 300, కొర్రమీను 800కు అమ్మారు. మత్స్యకారులు గండిపేట, హిమయత్‌నగర్ జలాశయాల నుంచి చేపలు తెచ్చి అమ్మారు.

**శంకర్‌పల్లి:** గండిపేట, ఖానాపూర్‌లోని చెరువు, సంగారెడ్డిల నుంచి చేపలు తెచ్చి అమ్మారు. మృగశిర కార్తె శనివారం రావడంతో అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేవని చేపల అమ్మకందారులు తెలిపారు.

**శంషాబాద్:** శంషాబాద్‌లో శనివారం మృగశిరను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. మధురానగర్, ఆర్బీనగర్, సిద్ధాంతి, కొత్వాల్‌గూడచౌరస్తా, అంబేద్కర్‌చౌరస్తా, ఎయిర్‌పోర్టుచౌరస్తా, అంగడిబజార్ ప్రాంతాల్లో చేపలు అమ్మారు. సాధారణ రోజు కంటే కిలోకు వంద ఎక్కువ చేసి అమ్మారు.

**ఆమనగల్లు:** పలికే మృగశిర కార్తె వేడుకలను ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లో ఘనంగా జరుపుకున్నారు. రైతులు వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని ఆలయాల్లో పూజలు నిర్వహించారు. సాగు పనులు ప్రారంభించారు. మృగశిర రోజున బెల్లంలో ఇంగువ కలుపుకొని తిన్నారు. మాంసం, మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. నాటుకోడి రూ.600 నుంచి రూ.800కి విక్రయించారు. చేపల కొనుగోళ్లకు ప్రజలు ఎగబడ్డారు. కొర్రమీను కిలో రూ.600 నుంచి 700, బొచ్చ రూ.150 నుంచి 200కు అమ్మారు. కిలో చికెన్ రూ.279కి అమ్మారు.



షాద్‌నగర్ అర్బన్: షాద్‌నగర్ మార్కెట్‌లో విక్రయిస్తున్న చేపలు



ఆమనగల్లులో జోరుగా చేపల విక్రయాలు

**మొయినాబాద్ రూరల్ :** గ్రామాల్లోని ప్రజలు భారీగా చేపలు కొనుగోలు చేసి వండుకొని ఆరగించారు. అజీజ్‌నగర్, చిలుకూరు గ్రామాలకు వచ్చి చేపలు కొన్నారు. హిమాయత్‌సాగర్ చెరువు చేపలకు మక్కువ చూపారు. 10 నుంచి 15కిలోల చేపలు వలలో చిక్కినట్లు మత్స్యకారులు తెలిపారు. మృగ కార్తె సందర్భంగా ముదిరాజు, వడ్డెర కులస్తులు చెరువుల వద్ద పూజలు నిర్వహించారు. చేపల విక్రయానికి మార్కెట్ యార్డును ఏర్పాటు చేయాలని మత్స్యకార సంఘం నాయకుడు శ్రీరాములు కోరారు.



షాద్‌నగర్‌లో పెద్ద చేపతో బాలుడు

## గ్రామాల్లో బడిబాట ర్యాలీలు

యాచారం/మాడ్గుల, జూన్ 8: బడీడు పిల్లలను బడిలో చేర్పాలని కోరుతూ యాచారం మండల గ్రామాల ఉపాధ్యాయులు శనివారం బడిబాట నిర్వహించారు. యాచారం, నందివనపర్తి, కుర్మిద్ద, మాల్, కొత్తపల్లి గ్రామాల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ బడిలో ఇంగ్లిష్ బోధన ఉంటుందని, మధ్యాహ్న భోజనం, రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందజేస్తున్నట్లు ఉపాధ్యాయులు ప్రజలకు తెలిపారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని మాడ్గుల ఎంఈవో సర్దార్ సూచించారు. మాడ్గుల జెడ్పీ పాఠశాల, దొడ్లపహాడ్ పాఠశాల టీచర్లతో ఎంఈవో బడిబాటలో పాల్గొన్నారు. దొడ్లపహాడ్‌లో ప్రతీ ఇంటికి వెళ్లి పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో టీచర్లు ప్రభంజన్‌రెడ్డి, శ్రీనివాసులు, నాగార్జున, సింహాచలం, శ్రీశైలం, అనురాధా, మాజీ సర్పంచ్ విజయనిరంజన్ గ్రామస్తులు పాల్గొన్నారు.



దొడ్లపహాడ్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల ర్యాలీ

## విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు అందజేస్తాం

మహేశ్వరం, జూన్ 8: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా స్కూల్ డ్రెస్సులను కుట్టిస్తున్నట్లు డీఆర్డీఏ పీడీ శ్రీలత తెలిపారు. శనివారం తుమ్మలూరు, హర్షగూడ, నాగారం, మహేశ్వరం, దుబ్బచర్ల క్లస్టర్లలో కొనసాగుతున్న మహిళా శక్తి కుట్టు కేంద్రాలను జిల్లా విద్యాధికారి సుసీందర్‌రావుతో కలిసి ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల దుస్తుల తయారీ ముమ్మరంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. పాఠశాలల ప్రారంభానికి ముందే అన్ని పాఠశాలలకు దుస్తుల పంపిణీ చేస్తామన్నారు. యూనిఫాంల తయారీ 80శాతం పూర్తయిందన్నారు. మహిళలను ఆర్థికంగా మరింత ఎదగాలనే ఉద్దేశ్యంతో కూడా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మండలంలోని 43 ప్రభుత్వ పాఠశాలల్లోని 4,596 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఒక్కరికి రెండు జతల చొప్పున మొత్తం 9,192 దుస్తులను కుట్టిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం ఎంపీడీవో శైలజారెడ్డి, మండల విద్యాధికారి కృష్ణ, ఏపీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



దుస్తులను పరిశీలిస్తున్న డీఆర్డీఏ పీడీ శ్రీలత

## రామోజీరావు మృతితో పలువురి సంతాపం



రామోజీ భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



రామోజీరావుకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

షాద్‌నగర్ అర్బన్/ఆమనగల్లు/మహేశ్వరం/శంషాబాద్ రూరల్/ఇబ్రహీంపట్నం, జూన్ 8 : రామోజీ సంస్థల అధినేత రామోజీరావు మృతిపట్ల పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం సంతాపాన్ని ప్రకటించారు. అక్షరమే ఆయుధంగా ప్రభుత్వాల్లో కదలికతెచ్చిన అక్షరయోధుడు రామోజీరావు అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. షాద్‌నగర్‌లోని ఎంపీ శేషయ్యనగర్‌లో కమ్మసేవా సమితి అధ్యక్షుడు వెంకట్‌రావు రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. రామోజీరావు మరణం పత్రికారంగానికి, సమాజానికి తీరని లోటు అని నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. రామోజీరావు మృతికి నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి సంతాపం తెలిపారు. ప్రజాస్వామ్య విలువలకు పట్టంగట్టిన వ్యక్తి రామోజీరావు మాజీ మంత్రి టి.దేవేందర్‌గౌడ్ అన్నారు. మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి రామోజీరావు భౌతిక కాయానికి నివాళ్లు అర్పించారు. రామోజీరావు మృతి సమాజానికి తీరని లోటు అని ఆధ్యాత్మిక గురువు త్రిదండి చిన జీయర్‌స్వామి పేర్కొన్నారు. రామోజీ ఫిలింసిటీలో రామోజీరావు పార్థివ దేహానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, క్యామ మల్లేష్ తదితరులు పూలమాల వేసి నివాళ్లర్పించారు.



రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎంపీపీ



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ

కొత్తూర్, జూన్ 8: వైఎం తండాలో 4లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులను ఎంపీపీ పి.మధుసూదన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఎంపీపీ నిధులతో రోడ్డు పనులు ప్రారంభించనట్లు ఎంపీపీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్లతో పాటు, మురుగు నీటి కాలువల నిర్మాణాల కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ డాకీ, మాజీ సర్పంచులు అరుణరమేష్, రవినాయక్, దశరథ్ తండావాసులు పాల్గొన్నారు.

## జిల్లాలోనూ ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలి



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్ అర్బన్/యాచారం/కేశంపేట/ఆమనగల్లు, జూన్ 8 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రంగారెడ్డి జిల్లాలో కలిసిన 10 మండలాల ఉపాధ్యాయులకు పదోన్నతి, బదిలీలు కల్పించాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రమిచ్చారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు కలిసి సమస్యను వివరించారు. గత ప్రభుత్వం 317జీవో కింద రంగారెడ్డి జిల్లాకు అదనంగా ఉపాధ్యాయులు వచ్చారని తెలిపారు. దీనిపై కోర్టు స్టే ఇచ్చిందని, స్టేను ఎత్తివేసి, బదిలీలు, పదోన్నతులకు అవకాశం కల్పించాలని కోరారు. జిల్లాలో టీచర్ల బదిలీల నిలుపుదల అన్యాయం అని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సత్తు పాండురంగారెడ్డి, ప్రవీణ్ కుమార్ అన్నారు. 9ఏళ్ల తరువాత కూడా ఉపాధ్యాయ బదిలీలు చేయకపోవడం సరికాదన్నారు. విద్యా శాఖ అధికారులు, గత పాలకుల తప్పిదంతో జిల్లా నిరుద్యోగులకు తీరని నష్టం జరిగిందని టీఎస్ పీఆర్టీ యూ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం అన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లకు షెడ్యూల్ జారీ చేసి రంగారెడ్డి జిల్లాను మినహాయించడం సరి కాదని కేశంపేట మండల యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధా న కార్యదర్శులు కె.రామ్మోహన్,రవికుమార్ అన్నారు. బదిలీలు, ప్రమోషన్లు చేపట్టకపోతే మారుమూల ప్రాంతాల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న టీచర్లు నష్టపోతారన్నారు. బదిలీలు, ప్రమోషన్ల నుంచి జిల్లాను మినహాయించడంతో తాము నష్టపోతామని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలతో పాటు షాద్‌నగర్ నియోజకవర్గ టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రణాళిక సం ఘం ఉపాధ్యక్షుడు జిల్లెల్ల చిన్నారెడ్డి, కల్వకుర్తి ఎమ్మె ల్యే నారాయణరెడ్డిలకు వినతి పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులకు 13 సంవత్సరాల నుంచి బదిలీలు, పదోన్నతులు కల్పించలేదన్నారు. ప్రభుత్వం కోర్టు స్టే తొలగేలా కృషిచేసి బదిలీ జిల్లాలోనూ ప్రక్రియను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. వినతి ప్రతం అందజేసిన వారి లో పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పి.వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు టి.వెంకట్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, విజయ్‌సాగర్, శ్రీనివాససాగర్, కిష్టారెడ్డి, వేణుగోపాల్, రాజేశ్వర్‌రెడ్డి, పద్మావతమ్మ, నాగేంద్రం, దేవయ్య, పద్మజారాణి, వెంకటయ్య, రాములయ్య, భగవంత్, రవీందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి ఉన్నారు.

## ఎల్‌పీజీ పైప్‌లైన్ దిమ్మెల కూల్చివేత





కూల్చిన పైప్‌లైన్ దిమ్మె

కేశంపేట, జూన్ 8: హిందుస్తాన్ పెట్రోలియం కంపెనీ కర్ణాటక రాష్ట్రంలోని హసన్ నుంచి హైదారాబాద్‌లోని చర్లపల్లి వరకు హై ప్రెషర్ ఎల్‌పీజీ పైప్‌లైన్ వేసింది. ఈ పైప్‌లైన్ ద్వారానే ఎల్‌పీజీ హైదరాబాద్‌కు వస్తుంది. పైప్‌లైన్ మండలంలోని రాగ్యాతండా నుంచి ప్రారంభమై ఇప్పలపల్లి, దత్తయపల్లి, వేముల్‌నర్వ, సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట మీదుగా వెళ్తోంది. అయితే వేముల్‌నర్వ శివారు లో పైప్‌లైన్ వెంట పాతిన దిమ్మెలను తొలిగించారు. ఓ రైతు తన పొలానికి ఫెన్సింగ్ వేసే క్రమంలో దిమ్మెలను తొలిగించినట్లుగా కన్పిస్తోంది. కేంద్రం ప్రభుత్వ ఆధీనం లోని ఎల్పీజీ కంపెనీ దిమ్మెలను తొలిగించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి దిమ్మెలను తిరిగి ఏర్పాటు చేస్తే పైప్‌లైన్‌ను గుర్తించే వీలుంటుంది.

## 'రాజీయే రాచమార్గం'

ఆమనగల్లు, జూన్ 8: పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌లు దోహదపడుతాయని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. ఆమనగల్లులోని కోర్టులో శనివారం లోక్ ఆదాలత్ నిర్వహించారు. ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల, తలకొండపల్లి మండలాల పరిధిలోని 1,392 కేసులు రాజీద్వారా పరిష్కరించినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఏపీపీ కార్తీక్, కడ్తాల సీఐ శివప్రసాద్, ఆమనగల్లు ఎస్సై బాల్‌రాంనాయక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ పాల్గొన్నారు.

## 'పట్నం'లో 2,718 కేసులు పరిష్కారం

ఇబ్రహీంపట్నం, జూన్ 8: జాతీయ మెగా లోక్ అదాలత్‌లో భాగంగా మండల న్యా సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఇబ్రహీంపట్నం కోర్టులో లోక్ అదాలత్‌లో మొత్తం 2,718 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ కక్షిదారులు రాజీ మార్గాన్ని ఎంచుకుంటే సమయంతో పాటు డబ్బు కూడా ఆదా అవుతుందన్నారు. అంతేగాక ఇరు పక్షాలకు న్యాయం అభిస్తుందన్నారు. చిన్న చిన్న తగాదాలతో కేసులు, కోర్టులంటూ తిరగకుండా ఇరు పక్షాలు కూర్చుని పరిష్కార మార్గం వెదుక్కోవాలని సలహా చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి యశ్వంత్‌సింగ్, న్యాయమూర్తి జయసింహ, ఏపీపీ వరలక్ష్మి, న్యాయవాదులు మాదన్న, నరేందర్ పాల్గొన్నారు.

## గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు 20 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

ఇబ్రహీంపట్నం, జూన్ 8: నేడు(ఆదివారం) జరగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకుగాను ఇబ్రహీంపట్నం పరిధిలో మొత్తం 20 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 13,056 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకుగాను అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శేరిగూడ శ్రీ ఇందూ ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 2,856 మంది పరీక్ష రాయనున్నారు. అలాగే ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 3,264 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. శేరిగూడలోని శ్రీ దత్త ఇన్‌స్టిట్యూషన్స్‌లో 3పరీక్షా కేంద్రాల్లో 2184 మంది, మంగల్‌పల్లి భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 504 మంది, భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 384 మంది, సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల -1 కేంద్రంలో 936 మంది, సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల -2 కేంద్రంలో 936 మంది, ఇబ్రహీంపట్నంలోని సైంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 624 మంది, చింతపల్లిగూడలోని ఎంఆర్‌ఎం కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో 364 మంది, రాందాస్‌పల్లి సమీపంలోని ఏపీఎన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో 720 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు అధికారులు తెలిపారు.

## మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

శంషాబాద్ రూరల్ జూన్ 8: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని బీఆర్ఎస్ నాయకులు నీరటి రాజు అన్నారు. నర్కూడ అమ్మపల్లి గ్రౌండ్‌లో నర్కూడ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని శనివారం ప్రారంభించారు. క్రీడాకారులకు జెర్సీలు అందజేశారు. క్రీడలు స్నేహ భావాన్ని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో మల్కారం సీఎస్‌సీఎస్ చైర్మన్ బూర్కుంట సతీష్, శివాజీ, శ్రీనివాస్, గుండాల విశ్వనాథం, క్రీడాకారులు, టోర్నమెంట్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటా-2024 వేడుకల్లో గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి



కడ్తాల్, జూన్ 8 : అమెరికా తెలుగు సంఘం అమెరికాలోని జార్జియా, అట్లాంటాల్లో నిర్వహిస్తున్న 18వ ఆటా-2024 వేడుకల్లో శనివారం కడ్తాల మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ నుంచి ఆయన పాల్గొన్నారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా ఆటా ప్రతినిధులు ఏర్పాట్లు చేశారని లక్ష్మీనర్సింహారెడ్డి ఫోన్‌లో తెలిపారు.

## కేవీపీని కలిసిన ఎమ్మెల్యే కసిరెడ్డి



ఆమనగల్లు, జూన్ 8 : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచందర్‌రావును శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కేవీపీని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకుడు సురభివెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

## కేసీఆర్‌ను కలిసిన ఉప్పల వెంకటేశ్



తలకొండపల్లి, జూన్ 8: మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ శనివారం మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో రాజకీయ పరిస్థితులు, ఎన్నికల్లో సాధించిన ఓట్లను వివరించారు. తన సొంత మండలం తలకొండపల్లిలో బీఆర్ఎస్‌కు మెజార్టీ ఓట్లు సాధించిన వెంకటేశ్‌ను ఈ సందర్భంగా కేసీఆర్ అభినందించారు.

## తీన్మార్ మల్లన్న విజయంతో కాంగ్రెస్ సంబరాలు

కడ్తాల్, జూన్ 8 : నల్గొండ-ఖమ్మం-వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్‌కుమార్ విజయం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కడ్తాలలో శనివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇకపై ఏ ఎన్నికైనా కాంగ్రెస్‌దే విజయమన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు మల్లెపల్లి జగన్, జహంగీర్‌బాబబ, భాస్కర్‌రెడ్డి, లక్ష్మయ్య, మల్లేశ్‌గౌడ్, అశోక్, రాంచందర్, జహంగీర్ అలీ, సత్యం, మల్లయ్య, శేఖర్ పాల్గొన్నారు.

## 'గృహజ్యోతి' అమలుతో హర్షం

ఆమనగల్లు/కడ్తాల్, జూన్ 8: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకం కింద 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలును హర్షిస్తూ ఆమనగల్లులో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికల కోడ్ మూలంగా ఈ పథకం అమలు కాలేదు. కోడ్ ముగియడంతో ప్రభుత్వ ఆదేశానుసారం విద్యుత్ శాఖ అధికారులు గృహజ్యోతి పథకం అమలు కు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల మానయ్య ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. రాజీవ్ కూడలిలో జాతీయ రహదారిపై నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

## శ్రీ కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్‌ను తొలగించాలని ఫిర్యాదు

శంషాబాద్, జూన్ 8 : శంషాబాద్ రహమాన్‌నగర్‌లో ఉన్న శ్రీ కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్‌లో విద్యాలకు తగిన సౌకర్యాలు లేనందున ఆ పాఠశాలను అక్కడి నుంచి తొలగించాలని గొల్లపల్లికి చెందిన నర్రెసిద్దులు శనివారం ఫిర్యాదు చేశాడు. ఆ కాపీని విలేకరులకు అందజేశాడు. ఈ పాఠశాలో విద్యార్థులకు ఆటస్థలంలేదు. ఒక్కరూం లోనే ఎక్కువ సంఖ్యలో కూర్చోబెడుతున్నారు. ఫీజులు కూడ అధికంగా వసూలు చేస్తున్నారన్నారు. పాఠ్య, నోట్ పుస్తకాలను అమ్ముతున్నారని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వసతులు లేని ఈ పాఠశాలలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున పాఠశాలను ఇక్కడి నుంచి తొలగించాలని కోరారు. తహసీల్దార్, ఎంఈవో, కలెక్టర్, డీఈవో, సీఎంకు కూడ ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## ఆమనగల్లు కోర్టుకు నూతన భవన నిర్మాణం



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ఆమనగల్లు, జూన్ 8: ఆమనగల్లులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అనువైన చోట స్థలాన్ని కేటాయించి భవనాల నిర్మాణానికి కృషిచేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అధునాతన కోర్టు భవనాల నిర్మాణం గూర్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలిసి విన్నవిస్తానని తెలిపారు. ఆమనగల్లు బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేపల్లి జగన్, ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులుయాదవ్, సీనియర్ న్యాయ వాదులు లక్ష్మణ శర్మ, యాదిలాల్ శనివారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లో కలిసివినతి పత్రం అందజేశారు. ఆమనగల్లు కు మూడేళ్ల క్రితం మంజూరైన కోర్టును మండల పరిషత్ పాత భవనాల్లో నిర్వహిస్తున్నారని, సరైన వసతులు లేక ఇబ్బందులు కలుగుతున్నాయని న్యాయ వాదులు వినతి పత్రంలో పేర్కొన్నారు.

## శంకర్‌పల్లి మండలంలో భారీ వర్షం



పంటపొలాల్లో నిల్చిన వర్షపు నీరు

శంకర్‌పల్లి, జూన్ 8: మండల పరిధి పర్వేద, మాసానిగూడ, హుసేన్‌పూర్ తదితర గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం రెండు గంటల పాటు వర్షం కురిసింది. పంట పొలాల్లో వర్షం నీరు నిల్చింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆ మూడు గ్రామాల మధ్యనే కుండపోతగా వర్షం కురువడంతో రైతులు మరింత ఆనందం వ్యక్తం చేశారు.

## సంక్షిప్తంగా...

● **ఆమనగల్లు:** ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ఎండీ ఫరీద్ జన్మదిన వేడుకలు శనివారం ఆమనగల్లులో నిర్వహించారు. కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐల ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్ వద్ద వేడుకల్లో నాయకులు పాల్గొన్నారు. ఫరీద్ కేక్ కట్‌చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలు చోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు జగన్, మానయ్య, కృష్ణయ్య, ఖాదర్, రహీమ్, అలీం, శ్రీశైలం, రాజు, శేఖర్, శివలింగం, వెంకటేశ్, కాలే మల్లయ్య, డిగ్రీ కృష్ణయ్య, సురేశ్, అశోక్, కుమార్‌గౌడ్, మల్లేశ్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

● **కందుకూరు:** ఈ నెల 10న నగరంలో నిర్వహించనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సదస్సులను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి అంకగళ్ల కుమార్ కోరారు. మండల కేంద్రంలో మాట్లాడారు. సోమవారం ఉదయం 10:30గంటలకు నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సదస్సులో ఉపాధి హామీ చట్టం అమలు, సవాళ్లు అనే అంశాపై చర్చలు ఉంటాయన్నారు. సదస్సుకు మండలం నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

● **కడ్తాల్:**దివ్యాంగులకు పింఛన్ రూ.6వేలు ఇవ్వాలనే పోరాట కార్యాచరణలో భాగంగా ఈ నెల 22న కడ్తాలలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య తెలిపారు. దివ్యాంగులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కడ్తాలలో సదస్సు విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నా అమలు కావడం లేదన్నారు. దివ్యాంగులకు ఉచిత రవాణ సౌకర్యం కల్పించాలని జంగయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు చిట్టి రాజు, యాచారం జంగయ్య, వరికుప్పల వెంకటేశ్, కంబాలపల్లి వెంకటేశ్, వరికుప్పల జంగయ్య, నర్సింహ్మా, మహ్మద్ సలీం పాల్గొన్నారు.

● **షాబాద్:** మన్‌మర్రికి చెందిన పొట్టిగారి నర్సింహులుకు చెందిన రెండు ఆవులు విద్యుతాఘాతంతో మృతి చెందాయి. ఉపాధి కోల్పోయిన నర్సింహులుకు మండల కురుమ సంఘం తరుపున మండల అధ్యక్షుడు మద్దూరి పాండు ఆధ్వర్యంలో రూ.60వేలు సహాయం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు జంగయ్య, లింగం, మాజీ ఉపసర్పంచ్ గోపాల్, సంఘం నాయకులు నరేందర్, చెన్నయ్య, కృష్ణ, నారాయణ, శ్రీకాంత్, విష్ణు, శంకరయ్య, శ్రీకాంత్, నగేష్, కుమార్ తదితరులు ఉన్నారు.

● **షాద్‌నగర్ అర్బన్:** జూలై ఒకటి నుంచి అమలులోకి రాబోతున్న మూడు కొత్త చట్టాలపై న్యాయవాదులు సంపూర్ణ అవగాహనను పెంపొందించుకోవాలని న్యాయశాస్త్ర నిపుణుడు, హైకోర్టు సీనియర్ న్యాయవాది ఏపీ సురేష్ అన్నారు. షాద్‌నగర్ కోర్టు సముదాయంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రాజు అధ్యక్షతన శుక్రవారం న్యాయవాదులకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యవక్తగా సురేష్ హాజరై అవగాహన కల్పించారు.

● **కేశంపేట:** గాడిలో పడి పాడి ఆవు మృతిచెందిన సంఘటన ఎక్లాస్‌ఖాన్‌పేటలో శనివారం చోటుచేసుకుంది. చింతోజు నారాయణచారి చెందిన ఆవు పొలం వద్ద కట్టేశాడు. రాత్రి ఆవు తెంపుకొని గాడిలో పడి చనిపోయింది. తన జీవనాధారం పోయిందని, తనను దాతలు, ప్రభుత్వం ఆదుకోవాలని పాడి రైతు కోరాడు.